# కొత్త రచయితలు

**డిగ్రీ కాలేజి ఆవరణ అంతా గందరగోళంగా వుంది. క్లాసులు ప్రారంభం కావడానికి ఇంకా పావు గంట సమయం వుండడంతో అందరూ బయట నిల్చుని మాట్లాడుకొంటున్నారు. అమ్మాయిలంతా గలగల కబుర్లు, నవ్వుల్లో మునిగితేలుతుంటే కుర్రాళ్ళ దృష్టి అంతా రోడ్డు మీదే వుంది. - ఇంకా వసుధ రాలేదు కనుక!**

వసుధ — ఆమెను, ఆమె అందాన్ని వర్ణించడం రాముని రమణీయంగా వర్ణించిన మొల్లకు కూడా సాధ్యం కాదేమో! చక్కటి చామన ఛాయలో, అందమైన కళ్ళతో గులాబీల వంటి ఎరుపైన బుగ్గలతో, లిప్‌స్టిక్ వేసినట్టు సహజంగానే ఎర్రనై మెరిసే పెదవులతో, ఆకర్షించే శరీర సౌష్టవంతో ఆడవారికే అసూయ పరిచేంత అద్భుతంగా వుంటుంది వసుధ. వసుధ ప్రేమ పొందలేకపోయినా ఆమె తన వైపు ఒక చూపు చూస్తే చాలు అనుకునే వారు చాలా మంది వున్నారు. కాని నేను ...

నేను అలా కాదు, ఆమెను సిన్సియర్‌గా పద్దెనిమిది నెలలుగా ప్రేమిస్తున్నాను.!

డిగ్రీ ఫస్ట్ ఇయర్ ప్రారంభమయిన రోజు నేను, నాతో ఇంటర్ చదివిన ఫ్రెండ్ ప్రసాద్ కలిసి క్లాసులో వున్నప్పుడు ఓ మెరుపు తీగలాంటి అమ్మాయి వచ్చి, "ఇది బి.ఎస్‌సి. ఫస్టియర్ బిజడ్‌సి ఇంగ్లీష్ మీడియమేనా?" అని అడిగింది. ఆ కంఠం వీణానాదంలా నా హృదయాన్ని తాకింది. ఆ అనుభూతి నుండి తేరుకోకముందే ప్రసాద్ "అవును" అన్నాడు. "ఈ క్లాసులో గర్ల్స్ లేరా?" అని మళ్ళీ అడిగింది. అప్పటికి తేరుకున్న నేను, "మీరు తప్ప ఇప్పటివరకు ఎవరూ లేరని" చెప్పాను. అప్పుడా మెరుపుతీగ తన పేరు వసుధ అని చెప్పి పరిచయం చేసుకుంది. ఆ విధంగా ఆమెను మొదటిసారిగా చూసినప్పుడే నా మనసు నాది కాకుండా పోయింది.

పద్దెనిమిది నెలలుగా సాగుతున్న నా ప్రేమ నా

## లవ్ స్టోరీ

## ప్రేమ వర్సెస్ పోటీ

గుండెలోనే సమాధి అయింది. ఆమెకు చెప్పాలంటే ధైర్యం చాలదు. ఎలా చెప్పాలో తెలియదు. ఒకవైపు చదువు సాఫీగా సాగుతున్నా నాలో ఏదో దిగులు. నా ఫ్రెండ్స్ అంతా ప్రోత్సహిస్తున్నా నాకు ధైర్యం రావడం లేదు. వసుధ మా క్లాస్‌మేటే అయినా మా ఇద్దరి మధ్యా మాటలు తక్కువే. ఎప్పుడో ఒకసారి మాట్లాడితే ఆ మాటలు నా గుండెలోకి ఎక్స్‌రేల్లా చొచ్చుకుపోతాయి. ప్రాక్టికల్స్‌లో వసుధది మా బ్యాచే. ప్రాక్టికల్స్ జరుగుతున్నప్పుడు ఎన్నోసార్లు ఆమెతో నా ప్రేమ విషయం చెబుదామనుకున్నాను. కాని ధైర్యం శూన్యం.

సెకండ్ ఇయర్ పరీక్ష ఫీజు కట్టాము. ఇంతలో మా క్లాసులో ఒక అమ్మాయి పెళ్ళి సెటిల్ అయింది. మ్యారేజికి మా క్లాసులో అందరిని పిలిచింది. మా గ్యాంగ్‌కి నేను లీడర్నయితే, గర్ల్స్‌కి వసుధ లీడ్ చేసేది. ప్రెజెంటేషన్ తీసికెళదామని నేను అందరికీ చెప్పాను. కాని వసుధ "అలా ఏం వద్దు లేడీస్ వేరే, జెంట్స్ వేరే ప్రెజెంటేషన్స్ తీసికెళ్దాము" అన్నది - అలాగే చేసింది. నాకు చాలా కోపం వచ్చింది. కాని ఏం చెయ్యను!

ఇంతలో నాకు బ్రహ్మాండమయిన ఆలోచన తట్టింది. నా ప్రేమను తెలపడానికి ఇంతకంటే మంచి అవకాశం రాదు అనుకున్నాను. ఏదో ఒక విధంగా ఈ పెళ్ళిలో నా ప్రేమ విషయం తెలియజేయాలి. కాని డైరెక్ట్‌గా కాకుండా ఇన్‌డైరెక్టుగా చెప్పాలనుకొన్నాను. అమ్మాయిలకి తెలియకుండా కెమెరా తీసికెళ్ళాను. మ్యారేజ్ అయిపోయాక అమ్మాయిలు, అబ్బాయిలు అంతా కలిసి గుడికి వచ్చేలా కన్విన్స్ చేశాం. నేను అనుకున్నట్టుగానే వారంతా మాతో కలసి గుడికి వచ్చారు. గుడిలో అందరం సరదాగా గడిపాం. ఫోటోలు దిగాం. వసుధకు తెలియకుండా ఆమె సింగిల్ ఫోటో ఒకటి తీశాను. తరువాత ఆ ఫోటో ఇస్తూ నా ప్రేమ తెలియపరచాలని అనుకొన్నాను. నేనంటే ఇష్టం వుంటే (!!!!) తన ఫోటోని ఆటోగ్రాఫ్ చేసి తిరిగి నాకు ఇవ్వమని అడగాలని నా ప్లాన్. తను ఆటోగ్రాఫ్, ఫోటో ఇస్తే సరి లేదంటే ఆమె గూర్చి మరచిపోవాలనుకున్నాను. ఒకరోజు ధైర్యం కూడదీసుకుని ప్రాక్టికల్ చేస్తూ వుంటే వెళ్ళి తన ఫోటో ఇచ్చి "ఆటోగ్రాఫ్ ప్లీజ్" అన్నాను. చిరునవ్వుతో "ఓ.కే." అంటూ ఆటోగ్రాఫ్ చేసింది.

ఆ ధైర్యంతో కొన్ని రోజుల తర్వాత ఆమెను ఒంటరిగా కలుసుకొని నా ప్రేమ విషయం చెప్పాను. అప్పుడు వసుధ "చూడు అనంత్. నేను నిన్ను ప్రేమిస్తాను. మనిద్దరం పెళ్ళి చేసుకొంటాం. బట్ వాట్ అబౌట్ అవర్ ఫ్యూచర్. మన భవిష్యత్ ఏమిటి? మన పెళ్ళి వల్ల నీ చదువు డిస్టర్బ్ అవుతుంది. కాబట్టి మన పెళ్ళి జరగాలంటే ఒక షరతు. డిగ్రీ పరీక్షలలో నువ్వు కాలేజీ ర్యాంక్ సాధించాలి. అలాగయితేనే నేను నిన్ను పెళ్ళి చేసుకొంటాను. ఇంకో విషయం మన ప్రేమ విషయం, నా షరతు విషయం ఎవరికీ చెప్పకూడదు. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ అయిపోయేంత వరకు నన్ను పర్సనల్‌గా కలవకూడదు. ఇవన్నీ గుర్తుంచుకో బెస్టాఫ్ లక్ ... బై" అంటూ వెళ్ళిపోయింది. అంతే నాకు నేనే హీరో అయిపోయాను. వసుధ నా ప్రేమను అంగీకరించగానే నాకు ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం


<u>రచయిత్రుల చిరునామా:</u>

**సమతా సిస్టర్స్**

హౌస్ నం. 17-1-14,
సుభాష్ రోడ్డు, కరీమాబాద్,
వరంగల్ - 506 002.



కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్




కలిగింది. మా గ్యాంగ్‌కు సీక్రెట్‌గా ఈ విషయం చెప్పి పార్టీ ఇచ్చాను. ర్యాంక్ సంపాదించడానికి చాలా కష్టపడాలనుకొని పగలనకా, రాత్రనకా చదవసాగాను. సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ అయిపోయాయి. అన్ని సబ్జక్టులూ మంచి మార్కులతో పాసయ్యాను. నేను వూహించిన దానికంటే ఫైవ్ పర్సెంట్ ఎక్కువే వచ్చాయి. వసుధకి ఒక పేపర్‌లో పరీక్ష పోయిందని తెలిసింది. తనను కలిసి తన బాధలో పాలు పంచుకోవాలని అనుకున్నాను. కాని ఆమె పెట్టిన షరతు వల్ల వెళ్ళలేకపోయాను.

ఫైనల్ ఇయర్ కోసం కాలేజి ప్రారంభం నుండే ప్రిపేర్ కాసాగాను. ఒక లక్ష్యం వైపు పరుగుతీసే క్రీడాకారుని వలె రాత్రింబవళ్ళు చదువుమీదే దృష్టిని నిలిపాను. పరీక్షల టైంటేబుల్ వచ్చింది. అంటే నా భవిష్యత్తు నిర్ణయించే కాలం దగ్గరకు వచ్చిందనుకొన్నాను. కష్టపడి పరీక్షలు వ్రాశాను. చివరి రోజు వసుధ కలిసి "ఎలా వ్రాసావ"ని అడిగింది. "నువ్వు నాకు దక్కేలా" అని సమాధానమిచ్చాను. ఆమె సిగ్గుపడుతూ వెళ్ళిపోయింది.

## కోర్కె

ఏయ్...
నిన్న నన్ను చొక్కా కాలర్ పట్టి
నిలదీస్తావా?
సంధ్యాకాశాన్ని ముద్దిడాలనే
నా ఈడేరని కోర్కె
నీ కెంపుల చెంపల్ని చూడగానే
తళుక్కున మెరిస్తే...
చమక్కున ముద్దాడి మురిసిన క్షణాన
చాంతాడంత రభసచేసి
చీదరించుకుంటావా...!?
నాది చిత్త చాపల్యం కాదు సుమీ
నీ సుతిమెత్తని బుగ్గల మీద హామీ
నీవు నన్ను కుదిపేసినా
చాంతాడంత రభస కురిపించినా
నీ చెంపలరోజాలనెన్నడు చెదరదు
సంధ్యాకాశాన్ని ముద్దిడాలనే...
నా కోర్కె చావదు!

— పి. శ్రీధర్ బాబు

పరీక్షా ఫలితాల కోసం ఎదురుచూడసాగాను. రేపు ఫలితాలు వస్తాయనగా వసుధ కలిసింది. పొద్దునే బస్టాండ్‌లోకి వెళ్ళీ వెళ్ళగానే పేపర్ వచ్చింది. నేను పాస్ అయ్యాను. ఆ పేపరుతో కాలేజికి వెడితే నోటీసు బోర్డులో నా పేరు ఫస్ట్ ర్యాంక్ ఎదురుగా కనిపించింది. అప్పుడు నేను ఆనందంతో వేసిన కేకకు కాలేజీ అదిరిపోయి వుండాలి. కాని నేను అక్కడ వుంటే కదా — వాయువేగంతో వసుధను కలవాలని బయల్దేరాను. అదృష్టవశాత్తు వసుధే కాలేజీకి వస్తూ కనిపించింది. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఆమెకు నా విషయం చెప్పాను. చిరునవ్వుతో కంగ్రాట్స్ చెప్పి మరునాడు వారి ఇంటికి రమ్మని ఆహ్వానించింది. ఆఘమేఘాల మీద తేలుతూ ఆ రోజంతా మా బ్యాచ్ ఎంజాయ్ చేశాం.

మర్నాడు ఉదయం వసుధ యింటికి వెళ్ళాను. నన్ను చూసి వసుధ బయటకి వచ్చి "వెల్‌కమ్ టు అవర్ స్వీట్ హోమ్" అంటూ ఆహ్వానించింది. వసు వెంట ఇంట్లోకి నడిచాను. అప్పటికే

హాల్లో ఇద్దరు మఖవారు, ఒక పెద్దామె వున్నారు. అందులో ఒకరిని "హి ఈజ్ మై ఫాదర్" అంటూ పరిచయం చేసింది. నేను షేక్ హ్యాండిచ్చాను. ఇంకో యువకున్ని చూపించి "హి యీజ్ మై వుడ్ బి" అంటూ పరిచయం చేసింది. అంతే — నా నెత్తిమీద పిడుగులు పడినట్టు అనిపించిఠది. నేను వున్న నేల పగిలినట్టుగా, నా గుండె ఆగిపోయినట్టుగా అనిపించింది. "అనంత్. ఇతను నా బావ. మా ఇద్దరికీ మూడేళ్ళ క్రితమే మ్యారేజ్ సెటిల్ అయింది. ఈ విషయం మన కాలేజీలో ఎవరికీ తెలియదు. నువ్వు నాపై ప్రేమను పెంచుకున్నావు. నేను నిరాకరిస్తే నీవు ఆ బాధతో చదువు నిర్లక్ష్యం చేస్తావు. అందుకే మా బావకి విషయం చెప్పి అతని సహకారంతో ఈ నాటకం ఆడాను. నిన్ను బాధ పెడుతున్నానేమో — అయాప్ు సారీ" అంది. అప్పుడు వసుధ బావ "చూడు మిస్టర్ అనంత్! వసుధ నాకు అంతా చెప్పింది. వసుధ నీ ప్రేమను నిరాకరిస్తే నీ బంగారు భవిష్యత్తు నాశనమవుతుంది. నేనూ ఇంతకు ముందు విద్యార్థినే కాబట్టి నాకు ప్రేమ గురించి, ప్రేమకున్న శక్తి గురించి బాగా తెలుసు. ప్రేయసి కోరితే ప్రేమికుడు ఆకాశాన్ని అందుకోవడానికి కూడా ప్రయత్నిస్తాడని నాకు తెలుసు. అందుకే వసుధ చేత నీ కాలేజి ర్యాంకు గురించి షరతు పెట్టించాను. అనుకున్నట్టుగానే నువ్వు దాన్ని సాధించావు. నీకు బంగారు భవిష్యత్తు వుంది. మిస్టర్ అనంత్ చదువుకోవలసిన సమయంలో ఎమోషన్స్‌కి లొంగి కాలం వృధా చేస్తే ఆ తర్వాత బాధపడి లాభం లేదు. పరీక్ష పాస్ కాని రోజు మంచి రిజల్ట్ ర్యాంక్ సాధించలేని నాడు మీ తల్లిదండ్రులు నీ మీద పెట్టుకున్న ఆశలు తారుమారు అవుతాయి. అందుకే ఈ నాటకం ఆడాల్సి వచ్చింది. నీ భవిష్యత్ బంగారు బాట కావాలని ఆశిస్తున్నాను. విష్ యు ఆల్ సక్సెస్" అన్నాడు. నేను ఒక్క మాట కూడా అనలేకపోయాను. ఏం అనగలను! నేను ర్యాంక్ తెచ్చుకొని కాలేజీలో గొప్ప పేరు పెంచుకోవడానికి వసుధ కారణమని ఆమెను ఒక దేవతలా పూజించాలో, నన్ను మోసం చేసినందుకు ఆమెను పీడకలలా మరచిపోవాలో తేల్చుకోలేక తడబడుతూనే 'థాంక్స్' చెప్పి భారంగా నా బంగారు భవిష్యత్‌లోకి మొదటి అడుగు వేశాను.

★

త్వరలో!

అతి త్వరలో!

టీనేజ్ రీడర్స్ కోసం

ఓ కాలేజీ విద్యార్థిని

రాస్తున్న సీరియల్ ...

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

# జోక్స్

## చోటు

"ఈ పేదవాడికి నీ హృదయంలో కాస్త చోటివ్వవూ!" తన్మయంగా అన్నాడు ప్రియుడు ప్రియురాలితో.

"అయితే ఈ నెల కూడా అద్దె కట్టడానికి డబ్బులు మిగలలేదన్న మాట" అంది ప్రియురాలు.

— జి.ఎ.నాష్/గరిడేపల్లి

## పినిషింగ్ టచ్

గీత అంది జ్యోతితో -

"రాత్రి నా బాయ్ ఫ్రెండ్ కలిశాడే?"

"ఊ. ఏమన్నాడు?"

"తనని పెళ్ళి చేసుకుని సుఖపెట్టమంటున్నాడు."

"నువ్వేమన్నావ్"

"రెండూ కుదరదు. ఏదో ఒకటే కోరుకో అన్నాను".

—అనిత్‌కుమార్

## కీహోల్

మారుతి, విజయ పార్కులో కూర్చున్నారు చీకటి పడింది.

"ఓ ముద్దిస్తావా?" అడిగాడు మారుతి

సమాధానం లేదు.

"ముద్దు పెట్టుకోనా?" గట్టిగా అన్నాడు ఈసారి.

విజయ మౌనం -

"నీకు చెవుడా?" గట్టిగా అడిగాడు మారుతి.

"నీకు పక్షవాతమా?" అంది విజయ నవ్వుతూ.

## రెండుకళ్ళు

"మా అమ్మాయికి అన్ని ఆభరణాలూ పెట్టి చూస్తే చక్కని చుక్క. చూడడానికి నీ రెండు కళ్ళూ చాలవు" చెప్పాడు పెళ్ళికూతురు తండ్రి రామారావు.

"అయితే మీ అమ్మాయిని చంద్రుడికిచ్చి పెళ్ళి చేయండి" అన్నాడు మారుతిరావు.

— గుండా అవినాష్

గరిడేపల్లి